

# చిర్నవ్వు

కోటి వసంతాలు వెల్లివిరిసినట్టు, కవి కమనీయకవిత నల్లినట్టు, గాయకుడు మధురంగా పాడినట్టు, చిత్రకారుడు మహత్తర కళాఖండాన్ని సృష్టించినట్టు, నెమలి పురివిప్పి నాట్యం చేసినట్టు నెలల బాబు నవ్వాడు.

ఆ నవ్వులో కరుణ కరిగి కాలువలా ప్రవహించింది. కొమ్మమీంచి మరో కొమ్మమీదకు దూకుతూ కోకిల తీయగా కూసింది. వెన్నెల చల్లగా కాసింది. సెలయేరు వొంపులు తిరుగుతూ గలగలా కదిలి ముందుకు సాగింది. గులాబీలు ఎర్రగా గుబాళించాయి. నక్షత్రాలు నీలాకాశంలో తళుక్కుమన్నాయి. మంచు బిందువు ధరిత్రిని సుతారంగా తాకింది.

చిన్నారి తనయుని ఆ అపురూపమైన నవ్వును చూసి, అతని తల్లి ఈ లోకాన్ని మరచింది. ఆమె తనువు పులకించింది. తడికళ్ళు రెప్పవేయకుండా అలా చూస్తూనే ఉండిపోయాయి. ఆవు తన పాలు తాగుతున్న లేగదూడను ప్రేమతో తాకినట్టు, పక్షి తన బుల్లి పిల్లను రెక్కల్లో పొదివి వెచ్చదనం ఇచ్చినట్టు. ఆమె తన కన్న తండ్రిని అక్కున చేర్చుకుని ముద్దులతో స్నానమాడించింది. ఆమె మనసు ఏ సుందర దూరతీరాలకో విహరిస్తూ వెళ్ళిపోయింది.

ఎన్నోసార్లు ఆకులు రాల్చి, చిగిర్చాయి చెట్లు. ఎన్ని పదుల, వందల సార్లో ఆమె ఆ అపురూపమైన నవ్వుకోసం అతని ముఖంలోకి చూసింది చంద్రుని కోసం చకోరపక్షిలా.

స్వాతి చినుకుకోసం ముత్యపు చిప్పలా......

"అమ్మా, పరీక్ష పాసయ్యానమ్మా" నవ్వుతూ సంతోషంగా అతను చెప్పినప్పుడు, ఆమె ఆత్రుతతో అతని ముఖంలోకి చూసింది. మరుక్షణం నిరాశగా నిట్టూర్చింది. నెమ్మదిగా గొణుక్కుంది. ఆ పిచ్చితల్లి ముఖం నీలినీడలను పులుముకుంది. నీరసంగా కళ్ళు మూసుకుంది. మళ్ళీ ఆశల దీపాలు హృదయంలో వెలిగించుకుంది.

"ఉద్యోగం వచ్చిదమ్మా" ఆనందంతో నవ్వుతూ అతను చెప్పినప్పుడు, కళ్ళు ఇంతింత చేసుకుని ఆశతో ఆమె కుమారుని ముఖంలోకి చూసింది. మరుక్షణం నిస్పృహతో నెమ్మదిగా గొణుక్కుంది. తిరిగి ఆశల దీపాలు హృదయంలో వెలిగించుకుంది.

"నీకు మనుమడు పుట్టాడమ్మా" సంతోషంతో నవ్వుతూ అతను చెప్పినప్పుడు ఆమె ఆత్రుతగా కుమారుని ముఖంలోకి చూసింది. వెంటనే నిరాశగా నెమ్మదిగా గొణుక్కుంది. మళ్ళీ ఆశల దీపాలు హృదయంలో వెలిగించుకుంది.

"అమ్మా, ఆఖరిదాని పెళ్ళిచేసేశాను" అని హాయిగా ఊపిరి పీల్చుకుంటూ నవ్వుతూ అతను అన్నప్పుడు, ఆమె ఆశగా కొడుకు ముఖంలోకి చూసింది. మరుక్షణం నిస్పృహతో నెమ్మదిగా గొణుక్కుంది. తిరిగి ఆశల దీపాలు హృదయంలో వెలిగించుకుంది.

అప్పుడెప్పుడో, ఎన్నోయుగాల కిందట చూసిన, చూసినట్టనిపిస్తున్న ఆ అపురూపమైన నవ్వు, అద్భుతమైన నవ్వు. అమోఘమైన నవ్వు ఇక చూడలేనా, చూడనే లేనా అని ఆ వెర్రితల్లి ఆశా, నిరాశల ఊయలపై ఊగుతూ, కాలాన్ని కదలనీయ రాదనుకుంటూ, కాలం వెంట నడుస్తూ, పరుగెడుతూ, ఒక్కోసారి ముందుకు సాగిపోతూ.....

"అమ్మా ఈ కుర్రాడు ఇక మనతోపాటే ఉంటాడు. ప్రేమ సమాజం నుంచి తీసుకొచ్చాను. తల్లిదండ్రుల కోసం కలవరిస్తుంటే వీడికి అన్నీ నేనే అవుదామనుకున్నాను. ఇన్నేళ్ళూ నేనూ, నా కుటుంబమూ అనుకుంటూ బతికేను. ఇక వీడికోదారి చూపించడానికే బతుకుతాను. రేపే వీణ్ణి బడిలో వేస్తాను" అని అతను తృప్తిగా చిర్నవ్వుతో చెప్పినప్పుడు... ముఖంలో ఆత్మానందం. తనకిందున్న తనువు సార్థకమయ్యిందని ముఖం భావిస్తున్నట్టు మాట్లాడుతున్న నవ్వు...కోటి వసంతాలు వెల్లివిరిసినట్టు, కవి కమనీయ కవిత నల్లినట్టు, మంచు బిందువు సుతారంగా ధరిత్రిని తాకినట్టు........... తనయుని ముఖంలో మళ్ళీ కనపించిన ఆ అపురూపమైన నవ్వును చూసి పరవశత్వంతో ఆమె కళ్ళు మూసుకుంది.

"ఎన్నాళ్ళ నిరీక్షణ ఫలించింది ఇన్నాళ్ళకు".

ఆమె ఆనందంతో ఊగిపోయింది. ఆమె గుండె ఆగిపోయింది.

*4 ఏప్రిల్ 1991, ఉదయం నవతరం వారపత్రిక*

*రచనా కాలం బహుశా 1971*